

# ప్రయాణంలో మనిషి సాయం

'రెండు రోజులుండి వద్దాం' అని యాజలి వెళ్ళాం. తీరా వెళ్ళాక తెలిసింది... మరో వారం రోజుల్లో మా గ్రామదేవత పుట్టలమ్మ గుళ్ళో తిరునాళ్ళు అని.

'రానే వచ్చారు, ఈ నాలుగు రోజులూ ఉండి వెళ్ళండి' అని బలవంతం చేశారు.

"నాకు మళ్ళీ రావడానికి వీలవదు" అన్నారు నాన్నగారు.

"అమ్మాయినీ పిల్లలనీ ఉంచి వెళ్ళండి. నేను మనిషిని తోడిచ్చి పంపిస్తాను" అన్నారు తాతయ్య. నాన్నా, అన్నయ్యా వెళ్ళిపోయారు.

తిరణాల తరవాత నేనూ, అమ్మా ప్రయాణం అయ్యాం. మా తాతగారి పొలంలో పనిచేసే యల్లమంద మాకు సాయంగా బయలుదేరాడు.

ట్రంకుపెట్టీ, పక్కచుట్టా, వేరుశనక్కాయలమూటా, కొబ్బరికాయల సంచీ, పచ్చళ్ళ బుట్ట–ఇవీ సామాన్లు.

రోడ్డుదాకా ఎడ్లబండి. బాపట్లదాకా బస్సు. బాపట్లలో రైలెక్కి తాడేపల్లి గూడెం వెళ్ళాలి. రోడ్డుమీదికి జేరాం. బస్సొచ్చింది. సామానంతా బస్సుమీద వేయించి మేము బస్సెక్కాం.

"ఒరే యల్లమందా! బస్సాగినప్పుడు ఒక కన్ను వేసి ఉంచు. మన సామాన్లు ఎవరూ దించకుండా చూసుకోవాలి" అంది అమ్మ.

"చిత్తం చిన్నదొరగారూ" అన్నాడు యల్లమంద.

పక్కన పల్లెలో ఆగగానే అమాంతం బస్సులోంచి దూకి మళ్ళీ ఎక్కాడు. కర్లపాలెంలో చూస్తే మనిషి కనిపించలేదు. అమ్మకి గాభరా వేసింది. "ఏడీ వీడు? ఇందాకటి స్టాపులో దిగిపోయాడేమే అని కంగారుగా-"ఆపండి, ఆపండి" అని అరిచింది.

బస్సాపేరు. విషయం చెప్పింది అమ్మ. "అతనా... టాపు మీద ఉన్నాడుగా" అని చెప్పాడొకతను.

"యల్లమందా" అని అరిచింది అమ్మ.

"ఇక్కడే ఉన్నాను చిన్నదొరగారూ, సామాను భద్రంగా ఉంది" అన్నాడు బస్సు టాపుమీదనించి. బాపట్లలో దిగి స్టేషనుకి వెళ్ళాం.

రైలు వచ్చింది. నేనూ, అమ్మా, ట్రంకుపెట్టీ, పక్కచుట్టా, పచ్చళ్ళసంచీ స్త్రీల పెట్టెలో ఎక్కాం. మా పక్క పెట్టెలో యల్లమందతో శనక్కాయల మూటా, కొబ్బరికాయల సంచీ ఎక్కాయి.

రైలు బయలుదేరింది. అప్పికట్ల స్టేషన్లో ఆగింది. రైలు దిగి పరుగున వచ్చి కిటికీ దగ్గర నిలబడి-

"చిన్న దొరగారూ...మనూరొచ్చేసిందా, దిగిపోదామా?" అన్నాడు యల్లమంద.

"నీ తలకాయ. ఇప్పుడేగా బయలుదేరాం? ఇంకా చాలా దూరం పోవాలి" అంది అమ్మ నవ్వుతూ.

పరుగున వెళ్ళి రైలెక్కాడు.

మళ్ళీ మాచవరంలో వచ్చాడు. "చిన్న దొరగారూ, దిగిపోదామా?" అంటూ.

"ఇప్పుడిప్పుడే కాదురా. నువ్వు మాటిమాటికీ దిగకు...సామాన్లెత్తుకు పోతారు" అంది అమ్మ.

మళ్ళీ నిదుర్రోలులో కిటికీ దగ్గరికి వచ్చాడు. ఒక చంకన శనక్కాయల మూటా, మరోవైపు కొబ్బరికాయల సంచీ.

"చిన్న దొరగారూ దిగిపోదామా?" అంటూ.

"చంపుతున్నావు కదురా! చూడు శ్రద్ధగా విను. ఇప్పుడు చద్దులవేళ అయింది కదా. మనం మన ఊరెళ్ళేసరికి నువ్వు గొడ్లని తోలుకొచ్చేవేళ అవుతుంది. అంతదాకా రైల్లో కూర్చో. చీటికీ మాటికీ దిగకు. రైలు కదిలి పోతుంది" అని చెప్పింది.

పరుగున వెళ్ళి రైలెక్కాడు.

అమ్మ అంత చెప్పినా ప్రతి స్టేషన్లోనూ రావటం అడగడం, చివరికెలా అయితేనేం బాదంపూడి జేరింది రైలు. మళ్ళీ వచ్చాడు మా యల్లమంద.

"చిన్న దొరగారూ, దిగిపోదామా?" అన్నాడు.

"ఇదే ఆఖరు స్టేషను. రైలెక్కు ఈసారి ఆగగానే దిగిపోదాం" అంది అమ్మ.

తాడేపల్లిగూడెంలో రైలాగింది. మా కోసం మా జవాను గణపతి వచ్చాడు. ఇద్దరం రైలు దిగాం. "బావున్నారా అమ్మా" అన్నాడు గణపతి.

"బాగానే ఉన్నాం. అయ్యగారు రాలేదా?" అంది అమ్మ.

ఏదో చెప్తున్నాడు గణపతి. మాట్లాడుతూనే బయటికి నడిచాం. రిక్షా ఎక్కబోతుంటే గుర్తుచేశాను. "అమ్మా! యల్లమంద ఏడీ?" అని.

నాలిక్కరుచుకుంది అమ్మ. 'మర్చే పోయాను' అంటూ మళ్ళీ స్టేషన్‌లోకి పరిగెట్టింది. వెంటే వెళ్ళాం మేము.

'యల్లమందా' అని పిలుస్తూ పెట్టి దగ్గరికి వెళ్ళింది. లోపల లేడు, కిందా లేడు.

'ఏడీ వీడు?' అని గాభరాపడింది. హఠాత్తుగా గుర్తొచ్చింది అమ్మకి.

"ఇందాక బాదంపూడిలో రైలాగినప్పుడు ఈసారి రైలాగినప్పుడు దిగిపో అన్నాను. ఔటర్‌లో రైలాగింది. కొంపతీసి అక్కడగానీ దిగిపోయాడా వెర్రివెధవ" అంది.

విషయం గ్రహించి "మీరు సామాన్ల దగ్గరుండండమ్మా. నేను వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు గణపతి.

"సరే వెళ్ళు" అని యల్లమంద ఎలా ఉంటాడో గుర్తులు చెప్పింది అమ్మ. గణపతి బయలుదేరాడు.

అమ్మ ఊహించింది నిజమే. ఔటర్‌లోనే ఉన్నాడు యల్లమంద. గుర్తుపట్టి 'యల్లమందా, యల్లమందా' అని పిలిచాడుట గణపతి.

దాంతో బెదిరిపోయి సామాన్లతో 'చిన్న దొరగారూ, పాప దొరగారూ' అంటూ పట్టాల వెంబడి పరుగు లంకించుకున్నాడుట యల్లమంద.

గణపతి వెంటపడ్డాడట. కానీ యల్లమంద పల్లెటూరి బలం ముందు గణపతి పట్నం బలం పనికి రాలేదుట.

కాస్త దూరం తరిమి లాభంలేక ఈసురోమంటూ తిరిగొచ్చాడు గణపతి.

అంతా విని 'పోనీ నేను వెళ్తాను' అంది అమ్మ.

"ఇంకా నయం, చీకటి పడుతోంది. ఆ పట్టాల వెంబడి మీరెక్కడికి వెళ్తారు?" అన్నాడు గణపతి.

తల పట్టుకుని కూర్చుంది అమ్మ. దేవుడిలా నాన్నగారు వచ్చారు. విషయం తెలుసుకుని ఉసూరుమని "మంచి సాయాన్నే తెచ్చుకున్నావు పుట్టింటినించీ" అని- సర్లే నేను వెళ్తా'నని బయలుదేరారు.

ఒక ఈత చెట్టుకింద కూర్చుని ఉన్నాడుట యల్లమంద.

నాన్నగార్ని చూడగానే పరిగెట్టుకు వచ్చాడుట. "దణ్ణాలు అల్లుడు దొరగారూ. నే బండి దిగేశా. చిన్న దొరగారూ, పాప దొరగారూ దిగకముందే బండి వెళ్ళిపోయింది. సర్లే ఎక్కడికి పోతారు...బండేసుకు మళ్ళీ వస్తారు అని ఇక్కడే ఉన్నా. ఇందాక ఓ దొంగవెధవ నా వెంట పడ్డాడు. ప్రాణం పోయినా శనక్కాయలూ, కొబ్బరికాయలూ వాడికిస్తానా? మా ఊరి పరువుపోదూ?" అన్నాడుట ఆనందంగా.

* * *